ప్రజాశక్తి
ఆదివారం 11 డిసెంబర్ 2022 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

వీడని వర్షం..తప్పని నష్టం..

- ఇప్పటికే 3 వేల ఎకరాలకుపైగా దెబ్బతిన్న పంట
- వర్షాలు కొనసాగితే ఇంకా మరింత నష్టం వచ్చే ప్రమాదం

వర్షపునీటిలో ఉన్న మినుము పంట

శింగరాయకొండ మండలం, పోతయ్యగారి పాలెం వద్ద అలల తాకిడికి తీరం వద్ద కోతకు గురై.. ముందుకొచ్చిన సముద్రపునీరు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలకు నష్టం తప్పలేదు. ఇంతటితో వర్షం పోతే తక్కువ నష్టంతోనే రైతులు బయటపడతారు. వర్షాలు కొనసాగితే నష్టం తీవ్రంగానే ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి తుపాన్ తీరం దాటింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి మొదలైన వాన శనివారం కూడా ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. కోస్తా ప్రాంతాల్లో వర్షం ప్రభావం ఎక్కువగా ఉంది. కందుకూరు డివిజన్.. దానికి అనుకుని ఉన్న మండలాల్లో పంటలకు ఎక్కువ నష్టం జరిగింది.

వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 3,190 ఎకరాల్లో రెండు రకాల పంటలు దెబ్బతిన్నాయి. శింగరాయ కొండ, పొన్నలూరు, సంతనూతలపాడు మండలాల్లో పొగాకు 354 ఎకరాలు, మినుము 2836 ఎకరాల్లో నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. ఇంకా నష్టం అంచనాలను తెప్పిస్తున్నామని తెలిపారు. వర్షం ఇంకా కురుస్తున్నందున ఏఏ పంటలు దెబ్బతిన్నాయనేదీ పూర్తిగా అంచనా వేయలేని పరిస్థితి కూడా ఉంది. ఆలస్యంగా వేసిన పైర్లకు నష్టం లేదు. ఇటీవల నాట్లు వేసిన మిర్చికి పెద్దగా నష్టం లేదు. పొగాకు తోటలకు నష్టం కనిపిస్తోంది. సాగర్ ఆయకట్టుతో పాటు కొమ్మమూరు కాలువ కింద ముందుగా సాగు చేసిన వరి మరో రెండు వారాల్లో కోతకు వస్తోంది. వరి పంట చాలా చోట్ల నేలవాలింది. గింజలు తడిచిపోయే ప్రమాదం ఉంది. ఇతర పంటలకు ఎంత మేరకు నష్టం జరుగుతుందో రెండు, మూడు రోజుల్లో తేలనుంది. వర్షం పోయాక పంటల పరిస్థితి ఏమిటన్నది తెలుస్తుంది. శనివారం ఉదయం నమోదైన వర్షపాతం చూస్తే జిల్లావ్యాప్తంగా 771.8 మి.మీ.ల వర్షం కురిసింది. జిల్లా సగటు 20.3 మి.మీ.లు నమోదైంది. శింగరాయకొండ, పొన్నలూరు, పామూరు, కనిగిరి, వెలిగండ్ల, జరుగుమల్లి మండలాల్లో ఎక్కువగా వర్షం కురిసింది. తుపాను తీరం దాటినా.. దాని ప్రభావం తగ్గలేదు. వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

శింగరాయకొండ మండలంలో వెయ్యి ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. వర్షం తాకిడికి మినుము పంట వర్షపు నీటిలో ఉంది. శింగరాయకొండ మండలం, పోతయ్యగారి పాలెం వద్ద అలల తాకిడికి తీరం వద్ద కోతకు గురై..సముద్రపు నీళ్లు ముందుకొచ్చాయి.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం..

చెరుకుపల్లి: వర్షానికి తడిసిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు అన్నారు. శనివారం చెరుకుపల్లి

▶ 2లో

చెరుకుపల్లిలో తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

వేటకు వెళ్లి..సముద్రంలో చిక్కుకొని..

- తుపాన్ కారణంగా ఒడ్డుకు చేరుకోలేని ఏడుగురు మత్స్యకారులు
- భారీవర్షాలు, అలలతో ఇబ్బందులు
- కొత్తపట్నం, వజ్జిరెడ్డిపాలెం తీరంలో లంగరు వేసుకొని ఉన్న వైనం..

దేవళం పల్లెపాలెం బీచ్ ఒడ్డులో పరిశీలిస్తున్న పోలీసులు, మెరైన్ అధికారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ, చీరాల

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు సముద్రంలో చిక్కుకున్నారు. తుపాను తాకిడికి అలల దెబ్బకు అటూ ఇటూ కదల్లేక సముద్రంలో నిలిచిపోయారు. వాళ్లను కాపాడేందుకు, బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. భారీవర్షాలు, అలల కారణంగా రెండు రోజులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రికి కొత్తపట్నం మండలం, వజ్జిరెడ్డిపాలెం తీరం సమీపానికి చేరుకున్న మత్స్యకారులు బయటకు రాలేక అక్కడే లంగరు వేసుకొని ఉన్నారు.

బాపట్ల జిల్లా, చీరాల వాడరేవుకు చెందిన ఏడుగురు మత్స్యకారులు ఈ నెల నాలుగో తేదీన బోటు తీసుకొని వేటకు వెళ్లారు. రెండు ఇంజిన్లు గల బోటులో వీరు వెళ్లి ఉన్నారు. తుపాను హెచ్చరిక మధ్యలో ఉన్నప్పుడు వచ్చింది. అప్పటికే అలలు ఉధృతంగా ఉన్నాయి. అటు కృష్ణపట్నం, రామాయపట్నం ప్రాంతాల నుంచి వేట కొనసాగిస్తున్న సమయంలో తుపాను ప్రభావం తీవ్రమైంది. రెండు రోజుల క్రితం ఎలాగైనా బయటికి

సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారుల్లో ముగ్గురు..

రావాలన్న ఉద్దేశంతో బోటుతో కదిలారు. డ్రైవర్ మెరుగు ప్రసాద్‌తో పాటు దాసరి పుజ్జాజి, గరికెన కష్ణ, కుక్కల మహేష్, మెరుగు శివ, బంగిన మల్లి, మడత పోలు అనే ఏడుగురు ఈ బోటులో ఉన్నారు. శనివారం నాడు తుపాను ప్రభావంతో పాటు అలలు ఉధృతంగా ఉండటం, వర్షం ఎక్కువ కావడంతో శింగరాయకొండ మండలం, ఊళ్లపాలెం పంచాయతీలోని దేవళం పల్లె పాలెం సముద్రతీరం ఎదురుకు చేరుకున్నారు. ఊళ్ల పాలెంలో ఉన్న ఒక వ్యక్తికి ఫోన్ చేసి.. మీ ఊరి దగ్గరలో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నామని వివరించారు. వెంటనే సదరు వ్యక్తి అధికారులకు సమాచారం తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న అధికారులు ఊళ్లపాలెం, దేవళం పల్లెపాలెం బీచ్ ఒడ్డుకు వచ్చారు. అక్కడ నుంచి సముద్రంలో బోట్లో ఉన్న మత్స్యకారులతో ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకున్నారు. వర్షం పడుతోందని, అలలు ఉధతంగా ఉన్నాయని, గాలులు విపరీతంగా ఉండటం వల్ల బోటు ఎటూ కదలలేని పరిస్థితి ఉందన్నారు. బోటు లో ఉన్న ఒక ఇంజిన్ చెడిపోయిందని, మరో ఇంజిన్ సహాయంతో ఉన్నామన్నారు. శుక్రవారం అంతా వర్షం దెబ్బకు భోజనం కూడా వండుకోలేదన్నారు. బోట్లో డీజిల్ 30 లీటర్లు మాత్రమే ఉందన్నారు. అక్కడి నుంచి మత్స్యకారులు గాలివానలోనే కొత్తపట్నం మండలం, వజ్జిరెడ్డిపాలెం చేరుకున్నారు. సముద్రంలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు మెరైన్ పోలీసులు, అటు నిజాంపట్నం, ఇటు కష్ణపట్నం కోస్ట్ గార్డు సిబ్బంది రంగంలోకి దిగారు.

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను

పెరిగిన ధరలకు అనుగుణంగా

మెస్ ఛార్జీలు పెంచాలి

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విస్తతస్థాయి సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విస్తత స్థాయి సమావేశం తీర్మానించింది. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విస్తత స్థాయి సమావేశం ప్రకాశం జిల్లా ఒంగోలు అంబేద్కర్ భవనంలో శనివారం సమావేశానికి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను మాట్లాడారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. హాస్టల్ విద్యార్థులకు డిగ్రీ ఇంటర్షిప్ ప్రణాళిక బద్ధంగా నడపాలని, కోర్సుకు అనుగుణంగా ట్రైనింగ్ ఉండాలని తీర్మానించారు. ఆ సమయంలో స్టే ఫండ్ ఇవ్వాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలో పాఠ్యపుస్తకాలు పూర్తిగా ఇవ్వాలని తీర్మానించారు. నూతన జిల్లాలో యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని, పీజీకి స్పాట్ అడ్మిషన్లు యూనివర్సిటీలో నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వినోద్, రాజా, రామ్మోహన్, మాధవ్, సూర్యచంద్రరావు, పెద్దిరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రీను, కిరణ్ అబ్దుల్లా, బాబావలి, నాగూర్ బి, పావని, పవన్, జిల్లా ఉపాధ్యక్షులు టి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నారాంబాబు

ప్రతి గడపలోనూ ఆప్యాయత

- ఎమ్మెల్యే అన్నారాంబాబు
- వర్షంలో కూడా సాగిన 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-గిద్దలూరు

ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రతి గడపలోనూ ప్రజలు ప్రేమ, ఆప్యాయత చూపుతున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని బందెలదొడ్డి బజారు-3 సచివాలయం పరిధిలోని గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఆయన ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి మూడేళ్ళ పాలనలో అందించిన సంక్షేమ బుక్‌లను అందించారు. అనంతరం ఆయా వీధుల్లో స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేయడంతో పాటు అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న ప్రవేశ పెట్టిన అనేక రకాల సంక్షేమ పథకాలతో ప్రతి అర్హుడు లబ్ది పొందారన్నారు. కుల,మతాలు పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికీ వైసీపీ పాలనలో ఆర్థిక భరోసా కల్పించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందన్నారు. జోరువానలోను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే అన్నా రాంబాబు గారు ప్రతి గడపలో పర్యటించారు. కార్యక్రమంలో వైసీపీ ముఖ్య నేతలు, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కో-ఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్ వలి,కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాండూస్ తుపాన్ నేపథ్యంలో

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ఎస్పీ మల్లికగర్గ్

తీరంలో పోలీసుల బందోబస్తు

సైక్లోన్ దృష్ట్యా జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని ఎస్పీ మల్లికగర్గ్ తెలిపారు. నదులు, వాగులు, వంకల పరివాహక ప్రాంతాల్లో ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో సహాయక శిబిరాలు, పునరావాస కేంద్రాలు గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. సముద్ర తీరం వెంబడి నివసిస్తున్న ప్రజలు పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు సూచించిన విధంగా ఆయా ప్రాంతాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు లేక తుఫాన్ షెల్టర్ కు వెళ్ళాలని, సైక్లోన్ దృష్ట్యా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, సముద్ర తీర బీచ్ ల వద్దకు పర్యాటకులు ఎవరు వెళ్లవద్దని ఎస్పీ సూచించారు. నదీ పరీవాహక ప్రాంతాలలో ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని, ప్రయాణించేందుకు అనువు కాని మార్గాల్లో, నీట మునిగిన రహదారుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి రహదారులను మూసివేయాలని, ఇతర మార్గాల ద్వారా వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం కొరకు ప్రజలు డయల్ 100 కి, పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266 లేదా స్థానిక పోలీసు అధికారులకు సమాచారమివ్వాలని ఎస్పీ కోరారు.

మానవహక్కుల సాధన అందరి బాధ్యత

ప్రజాశక్తి-కనిగిరి

మానవ హక్కుల సాధన అందరి బాధ్యత అని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలియజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన కాలనీలో మండల న్యాయసేవాధికార సంస్థ, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం వేడుకలను శనివారం నిర్వహించారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ప్రాథమిక హక్కులను కాపాడుకొనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గిరిజన హక్కులపై గుడ్‌హెల్ప్ డైరక్టర్ మంద్రు రమేష్‌బాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, వాలంటీర్ నవకుమార్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంద్రు రమేష్‌బాబు

వర్షమైనా తప్పని ప్రయాణం

చర్చి సెంటర్‌లో సైకిల్‌పై..

ఒంగోలులో జోరువాన

తుపాన్ ప్రభావంతో ఒంగోలు నగరంలోనూ శనివారం భారీవర్షం కురిసింది. వర్షం కురుస్తున్నా అనేకమంది ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం జోరువానలో ప్రయాణం చేశారు. కొందరు తడుస్తూనే ప్రయాణం చేయగా.. మరికొందరు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించారు.

- ప్రజాశక్తి, ఒంగోలు ఫొటోగ్రాఫర్

నిదానంగా వెళ్లకుంటే ప్రమాదమే..

రెయిన్ కోటు ఉందిలే..

వీడని వర్షం..తప్పని నష్టం..

(మొదటిపేజీ తరువాయి)

మండలం, కనగాలలో వర్షానికి తడిసిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. రైతులందరూ తడిసిన ధాన్యాన్ని, ఓదెలను జాగ్రత్తలతో వ్యవసాయ శాఖ సూచించిన పద్ధతుల ద్వారా మొక్క రాకుండా చూసుకోవాలని, వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని, ప్రతి ఒక్క రైతు వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్‌సత్తార్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి శ్రీలక్ష్మి, తహశీల్దార్ టి.ప్రశాంతి, మండల ఇన్‌ఛార్జి వ్యవసాయ శాఖ అధికారి మీరయ్య, ఏఈఓలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఒంగోలు 2 వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

IA No : 581/2022

AS No : 264/2018

బిట్వీన్
గోరంట్ల రామనాథం బాబు(డైడ్)మరియు ఇతరులు ... పిటిషనర్స్
మరియు
గోరంట్ల వీరనారాయణ బాబు మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్
టు
ఆర్. 10
సోమిశెట్టి వెంకట సత్యనారాయణ తండ్రి రసూల్ శెట్టి వయసు 38 సంవత్సరాలు, బిజినెస్
బండ్లమిట్ట, ఒంగోలు ప్రకాశం జిల్లా

పై నెంబరు పిటిషన్ లో కోర్టువారు నీకు నోటీసులు పంపగా నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు కావున శ్రీ కోర్టువారు నీకు నోటీస్ నిమిత్తం తేదీ 06-01-2023 కు వాయిదా వేసి ఉన్నారు కావున ఆరోజు ఉదయం 10.30 లకు పై తెలిపిన కోర్టులో నీవు స్వయంగా గాని లేదా నీ ఏజెంట్ ద్వారా గాని హాజరై సంజాయిషీ తెలుపుకొనవలెను లేనిచో కోర్టు వారు కేసును నీ పరోక్షమున తీర్మానించబడునని తెలియ పరచడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ///

ఇట్లు
మేకల రామమూర్తి
అడ్వకేట్,ఒంగోలు

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 43/2019

బిట్వీన్
కంజుల జయమ్మ ... వాది
మరియు
నార్నే కిషోర్ ...ప్రతివాది
టుజి
నార్నే కిషోర్ తండ్రి చెంచురామయ్య వయస్సు 51
హిందూ బిజినెస్, ఆలకురపాడు గ్రామం
టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా

పై నెంబరు దావాలో కోర్టువారు నీకు అనేక పర్యాయములు నోటీసులు పంపగా నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నావు కావున శ్రీ కోర్టువారు నీకు నోటీస్ నిమిత్తం తేదీ 30-12-2022 కు వాయిదా వేసి ఉన్నారు కావున ఆరోజు ఉదయం 10.30 లకు పై తెలిపిన కోర్టులో నీవు స్వయంగా గాని లేదా నీ ఏజెంట్ ద్వారా గాని హాజరై సంజాయిషీ తెలుపుకొనవలెను లేనిచో కోర్టు వారు కేసును నీ పరోక్షమున తీర్మానించబడునని తెలియ పరచడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ///

ఇట్లు
మేకల రామమూర్తి
అడ్వకేట్,ఒంగోలు

గుట్టుగా గంజాయి సాగు

- యువతే లక్ష్యంగా విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

భవిష్యత్తు తరాలకు బాటలు వేయాల్సిన యువత చెడు వ్యసనాలకు లోనవుతోంది. మత్తు సామ్రాజ్యం నగరాల్లోనే కాక పట్టణా ప్రాంతాలకూ వ్యాపించడం అంతులేని అనర్థాలకు కారణమవుతోంది. ఏజన్సీ ప్రాంతంలో అరుదుగా లభించే గంజాయి వెనకబడిన పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం పట్టణంలో సైతం అందుబాటులోకి రావడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలలో చిచ్చురేపుతోంది. నియంత్రించాల్సిన సెబ్ అధికారులు ఇసుక లారీలు, ట్రాక్టర్‌ల వెంట పడుతూ గంజాయి వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. మార్కాపురం పట్టణం బాపూజీ కాలనీలోని రెండు ప్రాంతాల్లో దాసరి నాగమ్మ, దాసరి పేరయ్యలు వారి గృహాల్లోని పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేసి ఆకును పొడిగా మార్చి యువతకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే పెద్దదోర్నాల మండలం పెద్ద బొమ్మలాపురం గ్రామంలో ఆడపల చిన్న కొండయ్య తన పొలంలో మిరపపంటను సాగు చేస్తూ పనిలో పనిగా గంజాయి మొక్కలు సైతం సాగుచేస్తున్నాడు. ఈ సమాచారం జిల్లా పోలీసు అధికారికి తెలియడంతో వారి ఆదేశాల మేరకు మార్కాపురం సెబ్ అధికారులు దాడి చేసి గంజాయి మొక్కలను ధ్వంసం చేసి నిందితుడిని ఆదుపులోకి తీసుకున్నారు. ఈ రెండు ప్రాంతంలో ఉన్న గంజాయి మొక్కల సాగు సమాచారం జిల్లా పోలీసు అధికారికి,

పెద్ద బొమ్మలాపురం గ్రామంలో రైతు సాగు చేసిన గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు (ఫైల్)

పట్టణంలో ప్యాకెట్‌ల రూపంలో లభిస్తున్న గంజాయి

మార్కాపురం పట్టణ పోలీసులకు తెలిసిందే తప్ప స్థానిక సెబ్ అధికారుల వద్ద ఎటువంటి సమాచారం లేదంటే వీరి పని తీరు ఏమిటో ఇట్టే అర్థమవుతోంది. మార్కాపురం పట్టణ, మండలంలో అక్రమ మద్యం వ్యాపారంతో పాటు గంజాయి కూడా అందుబాటులో ఉండడంతో యువత దారి తప్పుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సెబ్ అధికారుల ఉదాశీనత కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి యథేచ్ఛగా లభిస్తోంది. డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో గంజాయి మొక్కల సాగు సంబంధించిన ఆనవాళ్లు గుబులు రేపుతున్నాయి. పట్టణంలోనికొన్ని రహస్య ప్రాంతాల్లో విరివిగా గంజాయి లభిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రధానంగా యువతను లక్ష్యంగా చేసుకుని కొంత మంది వ్యక్తులు గంజాయి దందా సాగిస్తున్నట్లు వినికిడి. అక్రమ మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోని సెబ్ అధికారులు గంజాయి వ్యాపారంపైనా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో గంజాయి దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో భారీగా సొమ్ములు చేతులు మారుతున్నాయని బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ గంజాయికి విద్యార్థులు, యువత, మైనర్లు బానిసలుగా మారి అటు ఆర్థికంగా ఇటు ఆరోగ్య పరంగా కష్టాలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ కేటుగాళ్లువిక్రయిస్తున్న తీరు బట్టి చూస్తే సర్కారీ విభాగాల

పట్టణంలోని ఓ ఇంటిలో సాగు చేసిన గంజాయి మొక్క (ఫైల్)

వైఫల్యాన్ని మరోమారు ఎత్తిచూపుతుంది. గంజాయి ముఠా యువతకు గంజాయిని కొంత కాలంగా అలవాటు చేసిన తీరు మార్కాపురం పట్టణంలో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వ్యాపారం కోసం కొందరిని ఏజెంట్లు, సబ్ ఏజెంట్లుగా నియమించుకొని వారి ద్వారా యువతకు అమ్ముతున్నారు. యువత ఒక్కసారి గంజాయికి అలవాటు పడి దాని నుంచి బయటకు రాలేకపోతున్నారు. దీంతో యువత బహీనతలను ఆసరాగా చేసుకున్న గంజాయి వ్యాపారులు వారి దందాను జోరుగా నిర్వహిస్తున్నారు. పచ్చి పూతను మరగబెట్టి ప్యాకెట్లుగా మార్చి విక్రయించడం, ఎండబెట్టిన గంజాయిని ప్యాకెట్లు రూపంలో మార్చి ప్రాంతాన్ని బట్టి రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో వీటిని పొడిగా మార్చి సిగిరెట్లలో పెట్టుకొని దమ్మారే దమ్ అంటూ యువత ఆనందం పొందుతోంది. పట్టణంలోని కొంతమంది పోకిరులు డబ్బులకు ఆశపడి గంజాయి విక్రయదారులతో చేతులు కలిపి బంగారు భవిష్యత్తు ఉన్న యువతను నాశనం చేస్తున్నారు.

నిఘా అవసరం..

సెబ్ అధికారులు అడపాదడపా గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ వీటిపై పకడ్బందీగా దృష్టి సారించలేదని పుర ప్రజలు ఆరోపిస్తున్నారు. తక్షణమే అధికారులు గంజాయి వ్యాపారంపై నిఘా వేసి అసలు సూత్రధారులను పట్టుకొని గంజాయి మాఫియా ఆటను అరికట్టి పెడదారిన పడుతున్న యువతను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న తెలంగాణ ఆర్టీసీ బస్సు, మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

ఒకరు మృతి.. 20 మందికి గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

రోడ్డుపై ఆగి ఉన్న లారీని తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందగా బస్సులో ప్రయాణిస్తున్న దాదాపు 20 మందికి గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం శనివారం ఉదయం 3.40 గంటల సమయంలో జరిగింది. బల్లికురవ మండలం కొప్పెర పాడు గ్రామ సమీపంలో రోడ్డుపై ఆగిఉన్న లారీని బస్సు ఢీకొంది. హైదరాబాదు నుంచి ఒంగోలుకు వెళుతున్న ఈ బస్సు ప్రమాదంలో నెల్లూరు జిల్లాకు చెందిన వద్దినేని వెంకటేశ్వర్లు(57) మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు, 108 వాహనానికి, నామ్ ఎక్స్‌ప్రెస్‌వే సిబ్బందికి సమాచార అందించారు. స్థానికులు బస్సు అద్దాలను పగలగొట్టి క్షతగాత్రులను బయటకు తీశారు. పలు వాహనాల్లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన హరిత

విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి

ప్రజాశక్తి-పొదిలి

బట్టలు ఆరవేసే క్రమంలో విద్యుత్ సర్వీస్‌వైరు తగిలి మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విశ్వనాథపురం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని ఒక వీధిలో నివాసం ఉంటున్న బలసాని మహేష్ భార్య హరిత(20) శనివారం ఉదయం బట్టలు ఉతికి ఆరవేసే క్రమంలో దండేనికి అనుకుని ఉన్న ఇంటికి వినియోగించే విద్యుత్ సర్వీసు వైరును గమనించకుండా బట్టలు దండెంపై వేయడంతో విద్యుత్ షాక్‌కు గురై హరిత మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో మృతురాలి తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు.

పంచాయతీల సమస్యలపై 'రాయబారం'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గ్రామ పంచాయతీల సమస్యలను, సర్పంచుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు 13 ఉమ్మడి జిల్లాల సర్పంచుల నాయకత్వ నేతత్వంలో సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి)ఏర్పడి సమస్యలపై రాయబారం జరుపుతున్నట్లు సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి వీరభద్రాచారి తెలిపారు. ఈనెల 18న విజయవాడలో జేఏసీ సమావేశం కానున్నట్లు తెలిపారు. అనంతరం పంచాయతీరాజ్ మంత్రి బుడి ముత్యాలనాయుడు, కమిషనర్ కోన శశిధర్‌లతో సమావేశం కానున్నట్టు తెలిపారు. గత కొన్ని నెలలుగా గ్రామాలలో పంచాయితీలలో నిధుల కొరత, ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లింపు ముఖ్యంగా విద్యుత్ బిల్లుల చెల్లింపు, క్లాప్ మిత్రుల జీతాల చెల్లింపు, జీవో నెం.2పై స్పష్టత తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తేనున్నట్టు వీరభద్రాచారి తెలిపారు. ఈ అంశంలో మంత్రి చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం నాయకులు రమణారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

జోరు వానలో..

'గడప గడపకూ' నిర్వహించిన రామనాథం బాబు

ప్రజాశక్తి-చినగంజాం

జోరు వానలో, వాన నీటిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రావి రామనాథంబాబు శనివారం నిర్వహించారు. సిఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 172వ రోజు శనివారం చినగంజాం మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామంలో ఇన్‌ఛార్జి రామనాథం బాబు ప్రతి గడపకు వెళ్లి సిఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో వారికి అందచేసిన పథకాలను, పొందిన లబ్ధిని వివరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడమే లక్ష్యంగా సాగుతున్నట్లు తెలిపారు. గ్రామంలో ఒక్కొక్క కుటుంబానికి ఏయే పథకం ద్వారా ఎంతమేర లబ్ధి చేకూరుతుందో వివరిస్తూ మీ చల్లని ఆశీస్సులు, దీవెనలు ముఖ్యమంత్రి జగనన్నకు అందించాలని కోరారు. మూడున్నర సంవత్సరాల జగనన్న పాలనలో రెండు సంవత్సరాల పాటు కరోనా కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎన్ని వచ్చినా ప్రజలకు మంచి పాలన అందించిన ఘనత దేశంలో జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఎంత ప్రయోజనం చేకూరిందో ప్రతీ గడపకు

వర్షంలోనూ 'గడప గడపకూ'లో పాల్గొన్న రామనాథంబాబు

వెళ్లి వివరించారు. ఇందులో భాగంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకున్నారు. సచివాలయ ఉద్యోగులకు, వాలంటీర్లకు దిశా నిర్దేశం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే మేనిఫెస్టోను అమలు చేయటం ప్రారంభించామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయటమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలను కూడా చేపడుతున్నామన్నాని పేర్కొన్నారు. అభివృద్ధి ఒక ప్రాంతానికే పరిమితం కాకూడదన్నదే సిఎం జగన్ ఆలోచన అన్నారు.

పర్చూరులో పట్టుకున్న వాహనాలతో పోలీసులు

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

ప్రజాశక్తి-పర్చూరు

అంతర్ జిల్లా దొంగ సుందరరావును పర్చూరు పోలీసులు అరెస్టు చేశారు. పర్చూరు వై జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంగా సుందరరావును అదుపులోకి తీసుకున్నామని బాపట్ల డిఎస్పీ ఏ శ్రీనివాసరావు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వాయిదాలు చెల్లించలేని వాహన యజమానుల వద్దకు వెళ్లి తాను వాయిదా చెల్లిస్తానని సుందరరావు నమ్మబలికి అమ్ముకొని జల్సాలు చేస్తున్నాడన్నారు. ఇతనిపై నిజాంపట్నం, అర్ధవీడు, నరసరావుపేట తదితర చోట్ల కేసులు ఉన్నాయన్నారు. సుందరరావును పట్టుకునేందుకు మార్టూరు సిఐ ఐ ఆంజనేయరెడ్డి, పర్చూరు ఎస్ఐ జివి చౌదరి బృందాలుగా విడిపోయి గాలింపు చర్యలు చేపట్టి వై జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు వివరించారు. పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు నగదు బహుమతి అందించారు. ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందజేయనున్నట్లు డిఎస్పీ వివరించారు.

ఎలాంటి ధాన్యాన్నయినా ప్రభుత్వం కొంటుంది

జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని కోసిన వరి పంటను జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్ శనివారం పరిశీలించారు. మాండూస్ తుఫాన్ ప్రభావం ఇప్పటివరకు మన ప్రాంతంలో తక్కువగా ఉంది అన్నారు. రైతులు మాత్రం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు గ్రామంలో పనలపై (కోత కోసి) ఉన్న వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలించి, రైతులకు తగిన సూచనలు చేశారు. ఈ తుఫాను ఇంతటితో ఆగితే రైతులకు ఎలాంటి నష్టమూ వాటిల్లదని, పనలపై ఉన్న వరి ఓదెలకు 5శాతం ఉప్పునీటి ద్రావణం పిచికారీ చేసినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉంటుందని తెలిపారు. ఒకవేళ ఈ తుఫానుకు గింజ రంగు మారినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల డైరెక్టర్ హుస్సేన్, వ్యవసాయ విస్తరణ అధికారి సుదర్శన్‌రావు, మార్కెట్ యాడ్ డైరెక్టర్ కనికచర్ల వెంకట శివప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నగరం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటను ఎలా కాపాడుకోవాలి అనే విషయం గురించి మండల వ్యవసాయ

కోత కోసి ఉన్న వరి పంట పొలాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి వాగోలు బుష్

అధికారి వి రమేష్‌బాబు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. శనివారం మండలంలోని సిరిపూడి, పెదమట్లపూడి గ్రామాలలో పంట పొలాలను ఆయన పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు తెలియజేశారు. కోత దశలో వరి పైరులో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలి. వాలిపోయిన చేనును నాలుగు ఐదు దుబ్బుల చొప్పున కలిపి కట్టి పైకి లేపాలి. ఇలా లేవదీసిన చేనుకు పొడ తెగులు ఆశించే అవకాశం ఎక్కువ కాబట్టి నివారణకు హెక్సకొనజోల్ 80 గ్రాముల మందు ఒక ఎకరానికి దుబ్బుకు తగిలేలా పిచికారీ చేయాలి. అధిక నీటి ప్రవాహం తరువాత సుడిదోమ ఆశించే అవకాశం వుంది. నివారణకుగాను డైనోటెప్యూరాన్ 50 శాతం డబ్ల్యుపి 240 గ్రాముల మందు ఒక ఎకరానికి పిచికారీ చేయాలి. కోతకు ముందు వర్షాలు వస్తే వరి వెన్నుల మీద 5 శాతం ఉప్పు నీరు లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేయాలి. ఎకరానికి 10 నుంచి 15 కిలోలు ఉప్పు అవసరమవుతుంది. ఇలా చేస్తే 10-15 రోజుల వరకు గింజలు చెడిపోకుండా వుంటాయని మండల వ్యవసాయ అధికారి రైతులకు తెలియజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి కె నాగ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మణికంఠ స్వామి, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు: మొక్కజొన్న పైరు సాగులో రైతులు సకాలంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే

పిట్టలవానిపాలెం మండలం చందోలులో వరి పంట ఓదెలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్

పైరుకు, పంటకు నష్టం వాటిల్లే అవకాశాలుంటాయని మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పంగులూరు మండలంలో రైతులు ఈ సంవత్సరం ఎక్కువ స్థాయిలో 3,500 ఎకరాల్లో మొక్కజొన్న పైరును సాగు చేస్తున్నారని, అయితే పంట చేతికి వచ్చేవరకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం తుఫాను కారణంగా, వర్షాలు ఎక్కువగా పడుతున్నాయని, ప్రస్తుతం మొక్కజొన్న పైరు పెరుగుదల దశలో ఉన్నందున, వర్షాలు ఎక్కువైతే వీలైనంత త్వరగా కాలువల ద్వారా, వర్షపు నీటిని బయటకు పంపించాలన్నారు. ఎకరానికి 50 కిలోల యూరియా,

భట్టిప్రోలు మండలం ఐలవరంలో తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న డిఎఓ సత్తార్

మరియు 20 కిలోల పొటాష్ ఎరువులను, పైపాటుగా వేయాలన్నారు. కాండం తొలిచే పురుగు, ఆకు ఎండు తెగులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వీటి ఉధృతి ఎక్కువగా ఉంటే, నివారణకు 400 మిల్లీ లీటర్ల ఫోఫెనో పాస్, మరియు కొఫికో నజోల్ 200 మిల్లీ లీటర్లుకు, 200 లీటర్లు నీరు కలిపి, చేను బాగా తడిసేటట్లు పిచికారీ చేయాలని సుబ్బారెడ్డి సూచించారు. వర్షాలు తగ్గిన మూడు, నాలుగు రోజుల తరువాత, వరసల మధ్య

పంట పొలాలను పరిశీలిస్తున్న నగరం మండల వ్యవసాయాధికారి రమేష్‌బాబు

భాగాన్ని, గుంటకతో గాని, గోపు ద్వారా గాని, సేద్యం చేయాలని తెలిపారు. తద్వారా, మొక్కజొన్న రైతులు వర్షం ప్రభావం నుంచి, పైరును కాపాడుకోవచ్చని అన్నారు.

భట్టిప్రోలు: మాండూస్ తుపాను కారణంగా కురుస్తున్న వర్షానికి దెబ్బతిన్న వరి పంటను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్ పరిశీలించారు. మండలంలోని ఐలవరం గ్రామంలో నేలవాలిన, తడిసి ముద్దయిన వరి పంటను పరిశీలించి రైతులకు తగిన సలహాలు సూచనలు అందించారు. తుపాను ప్రభావం ఇంకా కొనసాగుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా తడిసిన ఓదెలపై ఎకరాకు 5 కేజీల ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటపై కూడా ఉప్పు ద్రావణాన్ని స్ప్రే చేస్తే గింజలు దెబ్బతినకుండా ఉంటాయని తెలిపారు. పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఆర్ఐ సురేష్, విఎఎ రమేష్, రత్నాకర్, నాయకులు హేమ సుందరరావు, రైతులు పాల్గొన్నారు.

నిజాంపట్నం: మాండూస్ తుఫాన్ పట్ల రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వాగోలు బుష్ సూచించారు. శనివారం మండలంలోని కోత కోసి ఉన్న వరి పంట పొలాలను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాండూస్ తుఫాన్ ప్రభావంతో ఇప్పటి వరకు మండలంలో 4.6 మి.మీ వర్షపాతం నమోదైందని చెప్పారు. పనలపై ఉన్న వరిలో ధాన్యం గింజలు మొలక రాకుండా ఉండాలంటే 5 శాతం ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. తుఫాన్ ప్రభావంతో ధాన్యం గింజలు రంగు మారినట్లయితే కూడా ప్రభుత్వం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులు ఆందోళన చెందకుండా జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పంగులూరు మండలంలోని మొక్కజొన్న చేను

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సిఐ

ప్రజాశక్తి-రేపల్లె

సిఐ విజయచంద్ర

ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సిఐ విజయచంద్ర తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మేము బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామంటూ తమ మొబైల్ ఫోన్లో ఓటిపిని చెప్పండి' అని ఎవరైనా అడిగితే చెప్పొద్దని అన్నారు. ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే, వంటి యాప్‌ల ద్వారా ఆర్థిక లావాదేవీలు జరిగినప్పుడు వాటి వివరాలు ఆగంతకులు అడిగితే చెప్పొద్దని సీఐ విజయచంద్ర ప్రజలకు సూచించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ క్లాసులంటూ పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇచ్చి తల్లిదండ్రులు వారు ఏం చేస్తున్నారో పట్టించుకోవడం లేదని, దీంతో పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్‌పై ఎక్కువ మొగ్గు చూపడంతో వారి భవిష్యత్తు పక్కదారి పడుతుందని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు తప్పక పిల్లలు ఫోన్‌లో ఏం చేస్తున్నారో పరిశీలించాలన్నారు. ఆన్‌లైన్ మోసగాళ్లు పిల్లల వద్ద నుంచి కూడా ఓటిపిని తీసుకుని నగదు బదిలీ చేసుకుంటున్నారని వెల్లడించారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఆర్థిక సాయం అందిస్తున్న టిడిపి నాయకుడు సీతారామయ్య

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మండల పరిధిలోని బలసులపాలెం గ్రామానికి చెందిన మోపర్తి దానమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబానికి తెలుగుదేశం పార్టీ నాయకులు 18 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ పది వేల రూపాయలు, గ్రామ సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి ఐదు వేల రూపాయలు, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు మూడు వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేయగా శనివారం మృతురాలి కుమారుడు మోపర్తి రూబేనుకు టిడిపి నాయకులు కొనకల సీతారామయ్య తదితరులు అందజేశారు. ప్రకాష్‌రావు, చలపతిరావు, శ్రీనివాసరావు, దానియేలు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-రేపల్లె: విద్యార్థుల్లో సజనాత్మకతను వెలికితీసేందుకు శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె రాంబాబు తెలిపారు. ఈ సంబరాలు బాపట్ల జిల్లా చీరాలలో టీటీడీ కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న గౌతమి జూనియర్ కాలేజ్, వుడ్ నగర్ వద్ద ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలో మండల, టౌన్ స్థాయిలలో జరిగిన చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రథమ స్థానం పొందిన జట్లు ఈ సంబరాలలో పాల్గొననున్నాయి. రేపల్లె టౌన్ నుంచి ప్రైవేట్ స్కూల్స్ విభాగంలో ప్రథమ స్థానం పొందిన శ్రీ రామకృష్ణ పబ్లిక్ స్కూల్ జట్టు, గవర్నమెంట్ స్కూల్స్ విభాగంలో ఆంధ్రరత్న మున్సిపల్ హై స్కూల్ జట్టును, రేపల్లె మండలం నుంచి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జడ్పిహెచ్‌ఎస్ నల్లూరి పాలెం జట్టు, రేపల్లె మండలంలోని ప్రైవేట్ స్కూళ్ల విభాగం నుంచి మాంట్ ఫోర్ట్ హై స్కూల్ జట్లు ఈ జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటున్నాయని రాంబాబు తెలిపారు.

నేడు ప్రత్యేక మహాజన సభ

ప్రజాశక్తి-వేటపాలెం: స్థానిక ది వేటపాలెం కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రత్యేక మహాజన సభ ఆదివారం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రారు, స్పెషల్ ఆఫీసర్ ఎల్ సుధాకరరావు శనివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజిలో ఈసభ జరుగుతుందన్నారు. సంఘ సభ్యులు, గ్రామ పంచాయతీ, తహశీల్దార్ కార్యాలయాలకు సభ నోటీసులు అందజేసినట్లు తెలిపారు. ఈ సభలో నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో జరిగిన విచారణ నివేదికపైనా, దుర్వినియోగమైన సంఘ నిధులు రాబట్టు అంశాలపైనా చర్చలు జరుగుతాయన్నారు.

భీకర గాలులతో రైతుల బెంబేలు

ప్రజాశక్తి-రేపల్లె

మాండస్ తుఫాన్ కారణంగా గత నాలుగు రోజుల నుంచి వాతావరణం మారింది. మబ్బులు, తేలికపాటి వర్షంతో రైతులు పంటలు ఎక్కడ దెబ్బ తింటాయో అని బెంబేలెత్తుతున్నారు. మండలంలో కోతలు, వరి కుప్పలు, మాసూళ్లు జోరుగా సాగుతున్న తరుణంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే మాసూళ్లు చేసిన ధాన్యం రోడ్లు, కల్లాల్లో ఉంది. ధాన్యం తడవకుండా రైతులు బరకాలు కప్పి కాపాడుకుంటున్నారు. మండలంలో ఇప్పటివరకు 25 శాతం మాత్రమే మాసూళ్లు జరిగింది. తుఫాన్ ప్రభావంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. రేపల్లె మండలంలో ధాన్యం ఆరబెట్టుకునేందుకు పొలాల వద్ద రాశులుగా ఉంచారు. వర్షానికి తడవకుండా రాశులపై బరకాలు కప్పి వాటిపై బరువైన వాటిని ఉంచుతున్నారు. ధాన్యం కాపా డుకోవడానికి రైతులు పాట్లు పడుతున్నారు. కోత యంత్రంతో ధాన్యం ఒబ్బిడి చేసుకునే పనులను చేపడుతున్నారు. పలుచోట్ల ధాన్యపు రాశులు చేలల్లో ఉన్నాయి. వర్షాల కారణంగా ఇప్పటికే ఎకరానికి సుమారు 6 బస్తాల వరకూ దిగుబడి కోల్పోయారు. మాసూళ్ల

ధాన్యాన్ని గోతాలకు ఎత్తుతున్న రైతులు

అనంతరం ధాన్యం రహదారులు, కల్లాలపై ఉన్న తరుణంలో చిరుజల్లులు, గాలులతో ఆందోళన చెందుతున్నారు. ధాన్యం రాశులపై కప్పిన పట్టలు గాలులకు ఎగిరిపోవడంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. పంట తడిచిపోతే నష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. భీకర గాలుల వల్ల ఇంకా కోయని వరి చేలకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే మాసూలు చేసిన ధాన్యం రాశులపై బరకాలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు.

గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి-అద్దంకి

మండలంలోని ధేనువకొండ గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నేత నలజల సుబ్బారావు దశదిన కార్యక్రమానికి శనివారం స్థానిక శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

నలజల సుబ్బారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

పంట పొలాల్లోకి చేరుకున్న వర్షపు నీరు

వలలు సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్తున్న మత్స్యకారులు

'మాండూస్' దెబ్బకు రైతన్న విలవిల

వర్షం కారణంగా పంటపొలాల్లోకి చేరిన నీరు

ఇదే పరిస్థితి కొనసాగితే భారీ నష్టం తప్పదంటున్న అధికారులు

వేటకు వెళ్లలేక ఇళ్లకే పరిమితమైన మత్స్యకారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ:

మాండూస్ తుఫాను దెబ్బకు శింగరాయకొండ విలవిలలాడిపోయింది. శుక్రవారం మధ్యాహ్నము నుంచి మొదలైన వర్షం శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. శింగరాయకొండలో 72 మిల్లీమీటర్ల వర్షము నమోదయిందని అధికారులు ప్రకటించారు. శింగరాయకొండ మండలంలోని లోతట్టు ప్రాంతాలైన ఊళ్ల పాలెం పంచాయతీలోని మత్య కార గ్రామమైన బావి వద్ద పల్లి పాలెం, దేవలం పల్లిపాలెం గ్రామా లలో వర్షంనీరు ఇళ్లలోకి ప్రవహి స్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. పాత సింగరాయ కొండ పంచాయతీ లోని ఇండస్ట్రియల్ ఏరియా వద్ద వర్షపునీరు రోడ్డు మీద పారుతుం డడంతో బాలి రెడ్డి నగర్ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసిబస్టాండు వర్షపు నీటితో చెరువుల మారిపోయింది. శింగరా యకొండ ఆర్ఎస్ పాఠశాల మూలగుంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణమంతా వర్షపు నీటితో నిండిపోయి ఉంది. భారీ వర్షము తుఫాను కారణంతో సముద్రం అలలు ఎగిసి పడుతున్నాయి. మత్స్యకారులు సముద్రం వేటకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నారు. వేట సాగితే కానీ పూట గడవని మత్స్యకారుడు జీవితం వరుస తుఫాను దెబ్బకి అల్లాడిపోతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తుఫాను తీరం దాటే సమయంలో భారీ వర్షంతో పాటు అలలు ఉదతంగా ఉండడంతో ఊళ్ల పాలెం పంచాయతీలోని మత్స్యకారుల బోట్లు వలలు చల్లా చెదురుగా పడిపోయి ఉన్నాయి. శనివారం నాడు ఆ వలలను సురక్షిత ప్రాంతాలకు చేర్చుకునే పనిలో ఉన్నారు. శింగరాయకొండ తాహశీల్దార్ సిహెచ్ ఉష ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గత రెండురోజులుగా మాండూస్ తుఫాన్ కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చేతికొచ్చిన పంట నీటిపాలవుతుందేమోనని రైతులు వాపోతున్నారు.. మినుము కొన్ని రోజుల్లో చేతికొచ్చే సమయంలో ఈ వర్షం దెబ్బకు రైతుకు నష్టం తప్పేలా లేదు. మరో పక్క వరి పొలం నిండా నీరు పారుతోంది. శింగరాయకొండ మండలంలో వరి పంటను సముద్ర తీర ప్రాంతమైన పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి గ్రామాల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో వేశారు. ప్రస్తుతం ఆ పంట భారీ వర్షాల కారణంగా నీట మునిగింది. మినుము పంట విషయానికొస్తే పాత సింగరాయకొండ, కనుమల్ల, కలికివాయి, శానంపూడి గ్రామాల్లో దాదాపు రెండు వేల ఎకరాలపైగా పంటను వేశారు. వర్షం తాకిడికి మినుము పంట వర్షపు నీటితో నిండిపోయి ఉంది.

ముక్కోడిపాలెంలో మినుము పంటలో వర్షపు నీరు

టంగుటూరు : మండలంలోని రైతులు ప్రస్తుతం తమ పొలాలను దుక్కి దున్ని భూములను సాగుకు అనుకులంగా చేసుకొని ఉన్నారు. మాండూస్ తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో పంటబ పొలాల్లోకి నీరు చేరింది. వ్యవసాయాధికారుల అంచనాల ప్రకారం ప్రస్తుతానికి పంటలకు పెద్దగా నష్టం లేకున్నప్పటికీ ఇదే పరిస్థితిలో శనివారం రాత్రి కూడా కొనసాగితే రైతులు అధికంగా నష్టాల పాలవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. మండలంలో అధికంగా ఓవైపు పొగనాట్లు మరోవైపు శనగ, మినుము తదితర పంటల సాగు శరవేగంగా జరుగుతున్నాయి. గత రెండు రోజులుగా టంగుటూరు మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో రైతుల పనులకు ఆటంకం ఏర్పడింది. మండలంలో ప్రధానంగా అగ్రభాగాన పొగనాట్లు జరుగుతుండగా 1200 ఎకరాలలో శనగ, మరో 700 ఎకరాల్లో మినుము సాగును రైతులు సాగు చేశారు. అదేవిధంగా మండలంలోని వల్లూరు, వాసేపల్లిపాడు, సూరారెడ్డిపాలెం తదితర గ్రామాలలో కొద్ది విస్తీర్ణంలో వరి సాగును రైతులు చేపట్టారు. ఆదివారం నుండి ఎండలు కాస్తే ప్రస్తుతం వర్షపు నీరు నిల్వ చేరిన పొలాలు కూడా తేరుకుంటాయని చెబుతున్నారు.

నాగులుప్పలపాడు : మాండూస్ తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి మిర్చి, మినుము, శనగ, పొగాకు పంటలు వేశారు. పొగాకు, మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటంతో అదికబాగం సాగుచేపట్టారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో వేసిన పంటలు సస్యశ్యామలంగా ఉన్నాయి. కానీ గత రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు మరో రెండు రోజులు కొనసాగుతాయని వాతావరణ చేసిన హెచ్చరికతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడితో సాగుచేసిన పంట ఎటువంటి ముప్పు వాటిల్లుతుందోనని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ వానలు ఇప్పటికైనా నిలిచపోతే బాగుండునని కోరుకుంటున్నారు. **కొనకనమిట్ల :** మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. బొబ్బర్లు, కంది పంటలు సాగు చేసిన రైతులో అయోమయ పరిస్థితి నెలకొంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పూతకు వచ్చిన కంది, కోతదశకు వచ్చిన బొబ్బర్లకు నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. సిద్దవరం, కాట్రగుంట, బచ్చలకూరపాడు, పాత పాడు, గరిమినపెంట, గొట్లగట్టు, చినమన గుండం, నాగంపల్లి గ్రామాలలో బొబ్బర్లు ఎక్కువ విస్తరణలో సాగు చేపట్టారు. కొనకనమిట్ల, నాగరాజుకుంట, చింతగుంట్ల, మునగపాడు, మంగాపురం ,బురదపాలెం, అంబాపురం, వాగుమడుగు, మునగపాడు, చిన్నారికట్ల, పెదరికట్ల గ్రామాలలో కంది సాగు చేశారు. చేతికి అన్ని వచ్చే పంట చేజారి పోతుందనివర్షాలు తగ్గకుండా ఉంటే రైతాంగం తీవ్ర నష్టాలకు గురికావాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **కొండపి:** మాండూస్ తుపాను కారణంగా కొండపిలో శనివారం 42.1 వర్షపాతం నమోదు అయిందని తహశీల్దారు కామేశ్వరరావు తెలిపారు. మండూస్ తుపాను కారణంగా కొండపి మండలంలో వేసిన పంట పొలాలో వర్షను నీరు చేరింది. మండలంలో శనగ 1400, మినుము 130, బొబ్బర్లు 160 హెక్టార్లో రబీలో పంటలు వేశారని మండల వ్యవసాయాధికారి వి.రాము తెలిపారు. పంటపొలాల నుంచి నీరు పోయేందుకు రైతులు దారులు తీసి వర్షం ఆగిన తర్వాత యూరియా 20 కెజీలు మరియు పోటాష్ 10 కేజీలు ఒక ఎకరానికి బలం ఎరువులు వేసుకోవాలని ఆయన తెలిపారు. వర్షాలను పంట పొలాలలో నీరు నిలిచిన చోట కొండపి-1 సచివాలయం విఎఎ వెంకటనారాయణ, అనకర్లపూడి సచివాలయం విఎఎ భరత్‌కుమార్ రైతుల వెంట పొలాలలో తిరిగి వారి సలహాలు సూచనలు అందచేశారు.

వర్షంలోనే విద్యుత్ లైన్లు రిపేరు చేస్తున్న దృశ్యం

తుపాన్ కారణంగా వీస్తున్న గాలి కారణంగా విద్యుత్‌లైన్లమీద విరిగి పడిన చెట్టుకొమ్మలను తప్పించి వెంటనే విద్యుత్ ఇవ్వడం జరుగుతుందని ఎఇ కుంచాల కోటయ్య తెలిపారు. చోడవరం గ్రామంలో చెట్లు విరిగి లైన్ మీద పడటం వల్ల ఉదయం నుంచి చోడవరం, ముప్పవరం మిట్టపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడడం జరిగింది. వెంటనే విద్యుత్ సిబ్బంది లైన్ క్లియర్ చేసి విద్యుత్ పునరుద్ధరణ చేయడం జరిగింది. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సిబ్బంది పనిచేస్తుంది.

సూరారెడ్డిపాలెం సమీపంలోని పొలాలలో చేరిన వర్షపు నీరు

అనకర్లపూడి శనగ పొలాలలో నిలిచిన వర్షపు నీరు

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ

పొదిలి ఎస్ఐగా మల్లిఖార్జున రావు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కె మల్లిఖార్జునరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వై శ్రీహరిని ఒంగోలు విఆర్‌కు బదిలీచేయగా ఆయన స్థానంలో కె మల్లి ఖార్జునరావు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో శింగరాయకొండ, గిద్దలూరులలో పనిచేశారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ బిసి సెల్ వైసిపి అధ్యక్షులు, కంభాలపాడు మాజీ సర్పంచ్ పులగోర్ల శ్రీనివాసులు శనివారం ఎస్ఐని కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపిపి

12న పూలే విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పట్టణంలో ఈ నెల 12వ తేదిన మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యర్రగొండపాలెం ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం విగ్రహవిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విగ్రహాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆయన సొంత నిధులతో అందజేశారని తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి పి అనిల్ కుమార్ యాదవ్, వైసిపి యర్రగొండపాలెం నియోజకవర్గ పరిశీలకుడు పోలేబోయిన రూప్ కుమార్ యాదవ్ ముఖ్య అతిధులుగా పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ డైరెక్టర్ ఎం బాలగురవయ్య, బీసీ సంఘాల నాయకులు కొమర కోటేశ్వరరావు గౌడ్, కాశయ్య గౌడ్, జిమ్మోజు వెంకటేశ్వరరాచారీ, జూపల్లి శ్రీను గౌడ్ పాల్గొన్నారు.

శ్రీ గౌతమి డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-దరిశి

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిగ్రీ 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో దరిశి శ్రీగౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులు టౌన్‌ఫస్ట్ సాధించి విజయకేతనం ఎగురవేశారు. బిఎస్‌సి అగ్రికల్చర్ విభాగము నందు గర్నెపూడి బ్లెస్సీ 450కు గాను 403 మార్కులు, బిఎస్‌సి బిజడ్‌సి విభాగము నందు గొల్లపాటి క్రీస్తురాణి 411మార్కులు, బిఎస్‌సి ఎంపిసిఎస్ విభాగము నందుపాటి తేజ వెంకటసాయి 409, బిఎస్‌సి ఎంఎస్‌సిఎస్ విభాగము నందు గుంతకల అనిత 400లకు గాను 369 మార్కులు, బి.కామ్. కంప్యూటర్ విభాగము నందు నులకా బాలవాణి 350 మార్కులకు గాను 291మార్కులు సాధించారు. ఈ విద్యార్థినీ, విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కనుమర్ల గుండారెడ్డి, ప్రిన్సిపల్ యు. రవి, అధ్యాపకులు అభినందించారు.

ఆగని పేదల వలస బాట

యర్రగొండపాలెం నియోజకవర్గంలో అత్యధికంగా వలసలు

ప్రజాశక్తి -యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లోని గ్రామాలలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అందరికీ పని కల్పించకపోవడం వలన పేదలు సుదూర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారు. జాబ్ కార్డు ఉన్న వారికి నిర్దేశించిన పనిదినాలు అయిపోయినా వారంతా వలసలు వెళ్తున్నారు. నిర్దేశించిన పనిదినాలు పెంచడంలో అధికారులు విఫలమవుతున్నారు. అయితే పనులు ఉన్నచోట కూడా కూలీ గిట్టుబాటు కాకపోవడం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఇప్పటికే యర్రగొండపాలెం నియోజకవర్గం నుండి దాదాపు 6,000 మందికి పైగా సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. పత్తి, వరి కోతలకు, చెరుకు, బేల్దారీ పనులు, మట్టి పనులు ఇలా బతుకుదెరువు వెతుక్కొంటూ వెళ్తున్నారు. వారి పిల్లల కోసం జిల్లా వ్యాప్తంగా 68 సీజనల్ హాస్టళ్లను సమగ్ర సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మంజూరు చేశారు. అదే విధంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో 14 సీజనల్ హాస్టళ్ల మంజూరయ్యాయి. జిల్లాలో నేటికీ ఒక్కటి కూడా ప్రారంభించలేదు. గ్రామాలలో వలసల కూలీల పిల్లలు సీజనల్ హాస్టల్లో ఉండి చదువుకోవాలనేది ప్రభుత్వం లక్ష్యం. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన జాతీయ ఉపాధి హామీ పథకంలో పనుల కల్పించినా ఎక్కువగా వలసలు ఉన్నాయని కచ్చితంగా వారి పిల్లలకి వసతి గహాలు ఏర్పాటు చేసి వారికి విద్యను అభ్యసించాలని జిల్లా అధికారులు వలస కూలీల పిల్లలకు సీజనల్ హాస్టళ్లను మంజూరు చేశారు. చాలా గ్రామాలలో కూడా వలస కూలీలు సుధీర్ఘ ప్రాంతాలకు వలస వెళ్లారు. జిల్లా అధికారుల స్పందించి వలస వెళ్లిన అన్ని గ్రామాల్లో సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయండి

టంగుటూరి సత్యనారాయణ, సిపిఎం కార్యదర్శి, యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి జిల్లాలోనే అత్యధికంగా పేదలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. పత్తి , వరి కోతలు ఇలా బతుకు దెరువు వెతుక్కొంటూ వెళ్తున్నారు. గత్యంతరం లేక పిల్లలను కూడా వెంట తీసుకెళ్తున్నారు. దీంతో వారి చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. వారి ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని సీజనల్ హాస్టళ్లను కాగితాల్లో మంజూరు చేయడం కాకుండా వలసలు అధికంగా ఉండే గ్రామాల్లో సీజనల్ హాస్టళ్ళను ఏర్పాటు చేసి విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలి.

జాబు కార్డు ఉన్న వారందరికీ ఉపాధి

కె నాగేశ్వరరావు, ఉపాధి ఏపిఓ, యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలం పరిధిలోని అన్ని గ్రామాలలో కూలీలకు జాబ్ కార్డు ఉంటే వారందరికీ అడిగిన వెంటనే ఉపాధి. పనులు కల్పిస్తున్నాం. పని దినాలు అయిపోయిన వారు మాత్రమే వలసలు వెళుతున్నారు. పని దినాలు ఉన్న వారందరికీ తక్షణమే ఉపాధి పనులు కల్పిస్తాం.ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులను వినియోగించుకోండి.

సదస్సుల అధ్యయనంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగం

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రస్తుత కాలంలో వివిధ అంశాలపై జరిగే సదస్సుల అధ్యయనం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేస్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ అన్నారు. శనివారం స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానిక్, ఆటోమొబైల్ విభాగాల ఆధ్వర్యంలో ఫ్యూచర్ జనరేషన్, ఫంక్షనల్ మెటీరియల్ అండ్ రీసెర్ట్ - 2022 పై చేపట్టిన అంతర్జాతీయ 2వ రోజు సదస్సులు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో మెకానిక్ రంగం అభివద్ధి, అధునాతన మిషనరీలు, రవాణా వాహనాల మెటీరియల్ తదితర అంశాలపై సదస్సులలో చేపట్టే అధ్యయనం పరిశోధనలకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. వరంగల్ నిట్ కీ-నోట్ స్పీకర్ జి రాఘవేంద్ర మాట్లాడుతూ పేస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు డోకా లేదన్నారు. ఈ సదస్సుల ద్వారా ఎన్నో ఆవిష్కరణలు పేటెంట్స్ పొందడం కళాశాలలకు ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఒ ఎం రమణబాబు, ఆటోమొబైల్ విభాగాధిపతి వి శివప్రసాద్, కళాశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

ఆర్టీసీ బస్టాండ్‌కు ఆదరణ ఏదీ?

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఊరికి దూరంగా పుల్లలచెరువు రోడ్డులోఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను ప్రజల సౌకర్యార్థం గత ఏడాది కోట్లాది రూపాయలు వెచ్చించి యర్రగొండపాలెం మధ్యలో నిర్మించారు. కోట్లు వెచ్చించి ఆర్‌టిసి బస్టాండ్ నిర్మించినా కూడా ఆర్‌టిసి అధికారులు నిధులు కేటాయించకపోవడం వల్ల వర్షం పడితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పట్లో రేకుల షెడ్డు నిర్మించి ప్రయాణికుల కోసం సిద్ధం చేశారు. గ్రామ పంచాయితీ వారు ప్రయాణ ప్రాంగణాన్ని చదును చేసి ఆర్టీసీ వారికి అప్పగించారు. ప్రతిరోజూ వివిధ జిల్లాల నుంచి ఈ ప్రయాణ ప్రాంగణానికి 60 బస్సుల దాకా వస్తుంటాయి. సుమారు నాలుగు వేల నుంచి ఐదు వేల మంది ప్రయాణికులు దీనిని వినియోగిం చుకుం టున్నారు. అయితే ఆర్టీసీ అధికారులు నిధులు మంజూరు చేయకుండా ఉండడంతో వర్షం కురిస్తే ప్రయాణ ప్రాంగణమంతా బురదమయంగా మారు తోంది. సరైన సదుపాయాలు లేకపోవడంతో ఆర్‌టిసి ప్రాంగణంలోకి అడుగు పెట్టేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి అధికారులు నిధులు మంజూరు చేసి ప్రయాణ ప్రాంగణాన్ని వర్షం కురిసినా రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మోడీకి దాసోహమైన వైసిపి, టిడిపి

ప్రజాశక్తి - దొనకొండ:

రాష్ట్రంలో అధికారంలో ఉన్నవైసిపి, ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలు ప్రధాని మోడీకి దాసోహమంటున్నాయని సిపిఎం జిల్లా నాయకులు జి శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన రెండు రోజులు పాటు జరిగే దరిశి నియోజకవర్గ సిపిఎం శిక్షణా తరగతులలో జి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణలో సిపిఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు, దర్శి, ముండ్లమూరు, కురిచేడు నాయకులు సందు వెంకటేశ్వర్లు, కర్నా హనుమయ్య, కెవి పిచ్చయ్య, కుందుర్తి అనిల్, అంజిబాబు, శ్రీకాంత్, ఉప్పు నారాయణ, జాన్, రంగనాయకులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసులు

వికలాంగుల పింఛన్ రూ. 6 వేలకు పెంచాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వికలాంగుల పింఛన్ రూ. ఆరు వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య డిమాండ్ చేశారు. వికలాంగుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ భవనంలో సభను నిర్వహించారు. ఈ సంధర్భంగా గుమ్మా రాజయ్య మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టంలో పొందు పరచిన అంశాలను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే అది వికలాంగుల చట్టంగా మారిందని అన్నారు.. అధికారులు, పాలకులు వికలాంగుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని పేర్కొన్నారు. వికలాంగులకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈపాటికే పింఛన్ తీసుకుంటున్న వికలాంగుల పింఛన్‌ను రూ. ఆరు వేలకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు చేదూరి సుధాకర్, మండల అధ్యక్షుడు పోలేపల్లి పెద్ద పాలంకయ్య మాట్లాడారు.

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అయ్యవారయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

అయ్యవారయ్య లేని లోటు తీర్చలేనిది

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మాజీ జడ్‌పిటిసి సభ్యుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు రావూరి అయ్యవారయ్య లేని లోటు తీర్చలేనిదని మండల వైసిపి నాయకులు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అయ్యవారయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక కొండపి రోడ్డులోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఎదురుగా ఉన్న అయ్యవారయ్య విగ్రహం వద్ద పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా పార్టీనేతలతో ఎంతో సత్సంబంధాలు కలిగి, టంగుటూరు పురోభివృద్ధికి ఎంతగానో శ్రమించిన వ్యక్తి అయ్యవారయ్య అని పలువురు కొనియాడారు. ఆయన మరణించిన రెండు సంవత్సరాలు అయిన సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వైసిపికి అయ్యవారయ్య చేసిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. అయ్యవారయ్య విగ్రహం వద్ద నివాళులర్పించిన వారిలో టంగుటూరు పిఎసిఎస్ అధ్యక్షుడు రావూరి ప్రవీణ్, రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, నాగేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గం చైర్మన్ గొల్లపూడి సునీత, వైసిపి సీనియర్ నాయకులు సూదనగుంట నారాయణ, సోమేపల్లి మురళీకష్ణ, ఎంపిటిసి కొమ్ము ప్రభుదాసు, గుడవర్తి కిషోర్ రాజు, ల్యాబ్ రమణయ్య, తుల్లిబిల్లి అశోక్ బాబు, బొడ్డు రవీంద్ర, శిఖా సుబ్బారావు ఉన్నారు.

ఎస్‌సి కాలనీలో నిలిచిన సాగర్ నీటి సరఫరా

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల కేంద్రం కొనకనమిట్ల ఎస్‌సి కాలనీలో వారం రోజులుగా సాగర్ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి మార్కాపురం శాసనసభ్యుడు కుందురు నాగార్జునరెడ్డి ఎస్‌సి కాలనీలో పర్యటిస్తారనే ఉద్దేశ్యంతో రోడ్ల వెంబడి ఉండే పిచ్చిమొక్కలను తొలగించే క్రమంలో పొరపాటుగా సాగర్ కాలువ పైపులైను పగిలిపోయింది. మరలా మరమ్మతులు చేసే పనులు మరచిపోయారు. ఇప్పటికీ వారం రోజులు కావస్తున్నా పగిలిన పైపులను మరమ్మతులు చేపట్టలేదు. దీంతో నీటి సమస్య ఏర్పడింది. చేతిపంపులో నీరు రాక, సాగర్ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే చర్యలు తీసుకొని పైపులైను మరమ్మతులు చేపట్టి సాగర్ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పొటాష్ ఎరువు.. సాగు బరువు

రైతులకు పెనుభారమవుతున్న పొటాష్ ఎరువు ధరలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పంటలకు కీలక పోషక ఎరువైన పొటాష్ ధర అమాంతంగా పెరిగిపోవడంతో ఆరుగాలం శ్రమించే అన్నదాతకు పెనుభారమైంది. పెరిగిన ధరలతో పొటాష్ కొనుగోలు చేసేందుకు రైతులకు ఆసక్తి కనబర్చడం లేదు. గతంలో పొటాష్ బస్తా ధర రూ.650 నుంచి రూ.900 వరకు పలికేది. ఆ ధర ప్రస్తుతం రూ.1700కు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొటాష్ వేయకపోతే పంట ఉత్పత్తుల నాణ్యత, దిగుబడులు తగ్గిపోవడంతో పాటు పురుగులు, తెగుళ్ల ఉధతి అధికమవడం, సాగు పెరిగిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. అయితే అన్ని పంటల్లో నాణ్యమైన దిగుబడులకు పొటాష్ వినియోగించాల్సి రావడంతో రైతులకు తలకు మించిన భారమైంది.

వై పాలెం నియోజకవర్గంలో..

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో కలిపి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 45 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. అలాగే

ఎరువులు చల్లుతున్న రైతు



పొటాష్ బస్తా

11500 ఎకరాల్లో వరి పంటపు సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పొటాష్ ధర రూ.1350 నుండి అమాంతం రూ.1700 వరకు పెరిగిపోవడంతో రైతులు ఆందోళనకు గురి కావాల్సి వస్తుంది. పొటాష్ ధర మరికొన్ని ఎరువులపై కూడా ప్రభావం చూపడం రైతులకు మరింత పెనుభారం అయింది. 17:17:17, 19:19:19 లాంటి కాంప్లెక్స్ ఎరువులలో కూడా పొటాష్ ఉంటుంది. వీటి ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. ఇవి మరింత ప్రియం కావడంతో వీటి వినియోగానికి రైతులు విముఖత చూపు తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. భాస్వరం ఎరువులు పెరగడంతో డీఏపీ, యూరియాకు డిమాండ్ పెరిగింది.

పొటాష్‌తో ప్రయోజనం..

పంటకు పొటాష్ వేయడం వలన గింజ, నాణ్యత పరిమాణం, తద్వారా దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. దీనివలన పంటకు మంచిధర పలికే అవకాశముంటుంది. అలాంటి పొటాష్ ఎరువు ఏడాది వ్యవధిలోనే ధర రెట్టింపు కావడంతో వినియోగించలేని దుస్థితి ఏర్పడిందని కర్షకులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొటాష్ ధర తగ్గించి రైతులకు ఆర్థిక చేయూత ఇవ్వాలని కోరుతున్నారు.

పొటాష్ కొనాలంటేనే భయమేస్తోంది

బాశం రమణారెడ్డి, రైతు, మురారిపల్లి

ఐదు ఎకరాలు పత్తి, ఐదు ఎకరాలు మిర్చి తోటలు వేశాను. బలం మందులు పెడుతున్నాను. కానీ పొటాష్ ఎరువు కొనాలంటే భయమేస్తోంది. పొటాష్ కలిసే ప్రతి ఎరువు ధర పెరిగింది. ఇలా ధర పెరగడం నేనెప్పుడు చూడలేదు. ధరలు ఇదే విధంగా పెరిగితే వ్యవసాయం చేయడం కష్టమే.

పొటాష్ ధరను తగ్గించాలి

దుగ్గినేని పిచ్చయ్య, రైతు, వాదంపల్లి

పొటాష్ ధర గతంలో రూ.వెయ్యి లోపు ఉండేది. అట్లాంటిది ఈ సీజన్‌లోనే అమాంతంగా రూ.1700కు పెరిగింది. ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. రైతాంగ సమస్యలు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఎరువుల ధరలపై నియంత్రణ విధించాలి. ఇష్టానుసారంగా ధరలు పెరగకుండా చర్యలు చేపట్టాలి.

ధర మన చేతుల్లో లేదు

పెద్ద వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి, యర్రగొండపాలెం

ఎరువుల ధరలు పెరగడం, తగడం అనేది మా చేతుల్లో లేదు. అయితే మార్కెట్‌లో నకిలీ ఎరువులను అరికట్టగలుగుతాం. ఖరీఫ్ సీజన్‌లో పొటాష్ ధర పెరిగిన మాట వాస్తవమే. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పొటాష్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు కొనుగోలు చేయవచ్చు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దట్టమైన పొగ మంచు వల్ల రోడ్డు ప్రమాదాలు నివారించడానికి రహదారులపై ఏర్పాటు చేసిన డ్రమ్ములు, స్టాపర్స్‌ను ప్రతిరోజు రాత్రి 10 గంటలకు తొలగించి తిరిగి మరసటి రోజు ఉదయాన్నే ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. గూడ్స్ వాహనాలను మనుషుల రవాణాకు వినియోగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. శీతాకాలంలో దట్టమైన పొగమంచు ఉన్న సమయంలో ప్రయాణం చేయకుండా ఉండటానికి ప్రయత్నించాలన్నారు. కానీ తప్పనిసరిగా ప్రయాణించ వలసిన అవసరం ఉన్నట్లయితే, వాహనం వేగం నెమ్మదిగా ఉండాలని, ఇతర వాహనాలకు దగ్గరగా

రోడ్డు భద్రత చర్యలు చేపడుతున్న బాపట్ల జిల్లా పోలీస్ అధికారులు

నడపవద్దని, నిర్దిష్ట దూరం పాటించాలని, హెడ్ మరియు టెయిల్ లైట్లు పని చేసే స్థితిలో ఉండాలని, దట్టమైన పొగమంచులో, మీరు రహదారిని స్పష్టంగా చూడగలిగేలా వాహనాలకు ఎల్లో లైట్లు అమర్చుకోవాలని, వాహనాన్ని మార్గమధ్యంలో నిలపవద్దని, ఒకవేళ వాహనాన్ని ఆపవలసి వస్తే పూర్తిగా రోడ్డు మార్జిన్ దిగి ఆపాలన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ అధికారులు మరియు సిబ్బంది రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా నో యాక్సిడెంట్స్ డే డ్రైవ్ చేపట్టారు. జాతీయ రహదారులపై ప్రమాద సంకేత బోర్డులు, రేడియం స్టిక్కర్లు అతికించి ఇసుకతో నింపిన డ్రమ్ము ను ఏర్పాటు చేస్తున్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపిదే విజయం: వేగేశన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దేశం అధినేత చంద్రబాబు ఇచ్చిన భరోసాతో పార్టీ కార్యక్రమాలకు నా పూర్తి సమయం వెచ్చించి కార్యకర్తలకు అండగా ఉంటూ బాపట్ల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేసేలా కృషి చేస్తానని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు బాపట్ల నియోజకవర్గ పర్యటన విజయవంతం అయిన సందర్భంగా శనివారం బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడా వచ్చినా సరే ఆటు రాష్ట్రంలో, ఇటు బాపట్ల నియోజక వర్గంలో తెలుగుదేశం జెండా ఎగరడం ఖాయ మన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి పథకాన్ని కొనసాగిస్తాం, బాపట్ల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత నాదన్నారు. వర్షాభావ

విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ

పరిస్థితులు ఉన్న సరే ఓపికగా ఎదురుచూసి ప్రజలు మంగళ హారతులు పడుతూ ఘన స్వాగతం పలికి తమ సంపూర్ణ మద్దతు తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజల నుండి వచ్చిన స్పందన చూస్తుంటే ఈ వైసీపీ ప్రభుత్వం పట్ల వారు ఎంత విరక్తి చెందారో అర్థం అవుతుందని, ఈ అరాచక ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఇదేమిఖర్మ అని బాధపడు తున్నారన్నారు. ఒక్క అవకాశం అని ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టిన జగన్‌రెడ్డి మీకు, మీ ప్రభుత్వానికి ఇదే చివరి అవకాశం.. మరో మారు మిమ్మల్ని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. రాబోయే రోజుల్లో బాపట్ల నియోజకవర్గంలోని ప్రతి కుటుంబాన్ని వ్యక్తిగతంగా కలిసి వారికి తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపేలా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళతాం. చంద్రబాబు నాయుడు పర్యటన ను విజయవంతం చేయడానికి కష్టపడిన నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయ పూర్వక ధన్యవాదాలు. దారి పొడవునా నిలబడి అపూర్వ స్వాగతం పలికిన, బహిరంగ సభలో పాల్గొన్న అశేష జనవాహినికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని నరేంద్రవర్మ తెలిపారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు మోదుగుల శంకర్ రెడ్డి, మద్దల ముసలయ్య పాల్గొన్నారు.

నేడు పావులూరులో మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

శంకర కంటి ఆసుపత్రి, కీర్తిశేషులు ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం నోవా అగ్రి గ్రూప్ హైదరాబాదు, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఇంకొల్లు మండలం పావులూరులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంకొల్లు మండలంలోని పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఏఆర్ డీఎస్పీగా ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

డీఎస్పీ ప్రేమ్ కుమార్

ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు శనివారం బాపట్ల జిల్లా పోలీస్ శాఖలోని ఏఆర్ విభాగంలో డీఎస్పీగా ఎండిహెచ్ ప్రేమ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రేమ్‌కుమార్ గతంలో పల్నాడు జిల్లాలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ప్రస్తుతం బాపట్ల జిల్లాకు కేటాయించారు.



పర్చూరులో రైతులకు పాసుపుస్తకాలు అందిస్తున్న ఆర్డీఓ, రామనాథంబాబు

రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరులో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద అర్హులైన రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. బాపట్ల జిల్లా ఆర్డీఓ వి రవీంద్ర చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ భూములు, ఆస్తుల రక్షణకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకం ద్వారా భవిష్యత్తులో వివాదాలకు తావులేకుండా ఉంటుందన్నారు. ప్రజలు తమ ఆస్తుల లావాదేవీలు గ్రామంలోనే కనిపించే విధంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని వివరించారు. వెనువెంటనే హక్కు లభిస్తుందని అన్నారు. వైసీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త రావి రామనాథంబాబు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మంచి కార్యక్రమానికి మళ్లీ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. భూములకు సంబంధించిన నిర్దేశించిన హద్దులు ఇప్పటివరకు లేవన్నారు. కేవలం 90 శాతం కేసులు సివిల్ కేసులకు సంబంధించినవేనని, భూములకు నిర్దిష్టంగా మార్కింగ్ చేసి ప్రతి ఒక్కరికీ గుర్తింపు నెంబరు ఇస్తే భూ వివాదాలకు చెక్ పెట్టవచ్చన్న లక్ష్యంతో ఈ పథకం తీసుకువచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు నెహ్రూబాబు, మాజీ జడ్పీటీసీ సభ్యులు కొల్లా సుభాష్‌బాబు, మాజీ ఎంపిపి కోట హరిప్రసాద్, గొల్లపూడి గ్రామ సర్పంచ్ పి రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

వర్ష పరిస్థితులు పరిశీలించిన వ్యవసాయాధికారి

ప్రజాశక్తి-వేటపాలెం

వరి పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఐ కాశీవిశ్వనాథం తెలిపారు. శనివారం ఆయన మండల పరిధిలోని కొత్తపేట, పాపాయిపాలెం, అక్కాయపాలెం గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట పొట్ట దశలో ఉన్నందున జాగ్రత్త చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. మినుము పంట పూత దశలో ఉండడం వలన నేలలో నీటిశాతం తగ్గిన తర్వాత ఎకరానికి యూరియా 5 కెజీలు, పొటాష్ 5 కెజీల చొప్పున వాడుకోవాన్నారు. పురుగు ఆశించకుండా ఇమిడాక్లోప్రిడ్ 2యంఎల్ వినియోగించాలన్నారు.

ఉప్పు రైతు బతుకు చప్పగా..

- ధర పెరిగినా.. సరుకు లేని పరిస్థితి..
- మంచి తెల్ల ఉప్పు రూ.400
- మరో రకం ఉప్పు రూ.350

ప్రజాశక్తి-శింగరాయకొండ

రైతుల వద్ద ఉప్పు ఉన్నప్పుడు ధర ఉండదు. ఉప్పు లేనప్పుడు ధర పెరుగుతుంది. మార్కెట్‌లో ధర పెరిగినప్పుడు ధర పెరిగిందన్న మాట విని ఆనందపటం తప్ప రైతులకు మరో మార్గం లేదు. వరుస తుఫానుల కారణంగా కురిసిన వర్షాలకు ఉప్పు కొటార్లు నీటమునిగాయి. ఫలితంగా ఉప్పు దిగుబడి తగ్గింది. ప్రస్తుతం ధరలు చూస్తే గతంలో కంటే పెరిగాయి. మంచి ఉప్పు కోసం రైతులు కష్టాలు పడుతున్నారు. కష్టపడితేనే గిట్టుబాటు ధర లభిస్తుంది. ప్రస్తుతం 75 కిలోల తెల్ల ఉప్పు బస్తా ధర రూ.400 ఉంది. ఈ ఉప్పు కోసం రైతులు కొటారులో 24 గంటల కష్టపడాల్సి వస్తుంది. గతంలో 75 కేజీల తెల్ల ఉప్పు బస్తా ధర రూ.370 ఉంది. ఇప్పుడు దాని ధర రూ.400కు చేరింది.

రెండో రకం ఉప్పు ధర రూ.350 ఉంది. ఈ ఉప్పు ఎలా ఉన్నా కొనుగోలు చేస్తుండటంతో అన్ని రకాలు కలిసి అమ్మకాలు చేపడుతున్నారు. 75 కేజీల ఉప్పు 350 రూపాయలకే అమ్మితే.. ఉప్పు రైతుకు నష్టం తప్ప లాభాలు ఉండవు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ఉప్పు రైతు లాభాల కోసం ఎదురుచూస్తున్నారు. ధర ఉన్నప్పుడు రైతు వద్ద ఉప్పు లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. వర్షాల కారణంగా ఉప్పు కొట్టారుల్లో ఉప్పును పండించాలంటే కొంత ఇబ్బంది. ఇన్ని కష్టాల్లో ఉన్న నేపథ్యంలో ఉప్పును పండించే సమయంలో వర్షాలు ఉండ కూడదు. శింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెం కేంద్రంగా ఉప్పు రవాణా జరుగుతోంది. ప్రతిరోజూ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు ఉప్పును లారీల ద్వారా సరఫరా చేస్తారు. ఇక్కడి నుంచి ఎక్కువగా రొయ్యల చెరువులకు, ఉప్పు ఫ్యాక్టరీలకు వెళుతుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఈ ఉప్పు రవాణా చేస్తారు. ఉల్లపాలెం గ్రామంలోని 400 ఎకరాల్లో ఉప్పు కొటారు భూములు ఉన్నాయి. బింగినపల్లిలో 200 ఎకరాలు, పాకలలో 300 ఎకరాల భూముల్లో ఉప్పును పండించడం జరుగుతుంది. ఎక్కువ శాతం ఊళ్లపాలెం నుంచే సరఫరా అవుతుంది. నాడు బ్రిటిష్ కాలంలో ఊళ్ల పాలెం ఉప్పుకి మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం గతంలో పండించిన ఉప్పును కుప్పల్లో భద్రంగా ఉంచుకొని నేడు కొంతమంది అమ్మకాలు చేపడుతున్నారు. మరికొంతమంది మాత్రం పంట వేసేందుకు సిద్ధమవుతున్నారు. 75 కేజీల మంచి ఉప్పును 400 రూపాయలకి కొనుగోలు చేసుకొని పోతున్నారు. ధర ఉన్నప్పుడు ఉప్పు ఉండదని, ధరలు లేనప్పుడు ఉప్పు ఉంటుందని ఊళ్లపాలెం ఉప్పు రైతులు చెబుతున్నారు. ఒక కూలికి ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు 700 రూపాయల నుంచి 900 రూపాయల వరకు ఇవ్వాల్సి వస్తుంది. ఇక కౌలుకి తీసుకున్న ఉప్పు రైతు కష్టాలు వర్ణణాతీతం. ఒక ఎకరాకి 1000 బస్తాలు ఉప్పు పండితే కౌలు మాత్రం 400 బస్తాలు ఆ భూమి యజమానికి ఇవ్వాల్సిందే. గతంలో 200 బస్తాలు మాత్రమే ఇచ్చేవాళ్ళు. ఇప్పుడు ధరలు పెరగటం వల్ల 400 బస్తాలు పొలం వాళ్ళు డిమాండ్ చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఓ పక్క ధరలు పెరుగుతుంటే సాగుబడి లేని పరిస్థితి. ఉప్పు రైతు బతుకు చప్పగా మారిపోయింది.

ఉప్పు బస్తాలను లారీలోకి ఎక్కిస్తున్న దృశ్యం

18కి జిల్లా స్థాయి చెకుముకి వాయిదా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా పొదిలి లో ఆదివారం జరగాల్సిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఈనెల 18 వ తేదీకి వాయిదా వేసినట్లు జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్. జయప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ సైన్స్ సంబరాల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జున రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి బి.విజయభాస్కర్, జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ లు హాజరవుతారన్నారు. పిల్లలలోని సజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు వివిధ స్థాయిల్లో నిర్వహించబడుతున్న చెకుముకి సైన్స్ సంబరాలు ఉపయోగపడతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల స్థాయి పరీక్షలలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల విభాగాలలో మొదటిస్థానం పొందిన ముగ్గురు విద్యార్థులతో కూడిన 57 బందాలు ఈనెల 18 న జరుగనున్న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలలో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణం లక్ష్యంగా జెవివి చేస్తున్న కషిలో భాగంగా జరుగుతున్న ఈ చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయవలసిందిగా ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాధికారులు, జెవివి కార్యకర్తలను ఆయన కోరారు.

మాట్లాడుతున్న డిఆర్ఓ ఓబులేసు

పకడ్బందీగా డిపార్ట్‌మెంట్ పరీక్షలు

డిఆర్ఓ ఓబులేసు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపిపిఎస్‌సి) నిర్వహించే డిపార్ట్‌మెంట్ పరీక్షలలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేసు స్పష్టం చేశారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో శనివారం ఈ విషయమై సంబంధిత అధికారులు, లైజనింగ్ ఆఫీసర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ నెల 12వ తేదీన పెద్దారవీడు మండలం దేవరాజు గట్టులోని కష్ణచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, దరిమడుగులోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జరిగే ఈ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. సమావేశంలో పోలీసు, రెవెన్యూ, విద్యుత్, రవాణా, వైద్య శాఖల అధికారులు, పరీక్ష కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో 20.3 మి.మీ.ల వర్షపాతం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుపాన్ కారణంగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో 20.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శింగరాయకొండలో అత్యధికంగా 57.6 మిల్లీమీటర్లు, పెద్దారవీడులో అత్యల్పంగా 2.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పామూరులో 42 మిల్లీమీటర్లు, కొండపిలో 41.2, వెలిగండ్లలో 37, జరుగుమల్లిలో 34.4, కనిగిరిలో 33.6, పిసిపల్లిలో 32.8, ఒంగోలులో 32.6, సిఎస్‌పురంలో 32.4, మర్రిపూడిలో 32, కొత్తపట్నంలో 31.8, సంతనూతలపాడులో 30.6, టంగుటూరులో 30.4, హెచ్‌ఎంపాడులో 26.8, పొన్నలూరులో 24.8, మద్దిపాడులో 21.6, నాగులుప్పలపాడులో 20.6, పొదిలిలో 18.4, కొనకనమిట్లలో 16.3, కొమరోలులో 15.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చీమకుర్తిలో 14.2 మిల్లీమీటర్లు, దోర్నాలలో 12.8, గిద్దలూరులో 11.4, బేస్తవారపేటలో 10.8, పుల్లలచెరువులో 10, దర్శిలో 9.8, తాళ్ళూరులో 9.4, తర్లుపాడులో 9.4, యర్రగొండపాలెంలో 9.2, కంభంలో 9.2, దొనకొండలో 8.4, మార్కాపురంలో 8.2, త్రిపురాంతకంలో 8.2, ముండ్లమూరులో 7.6, రాచర్లలో 7.5, కురిచేడులో 7, అర్ధవీడులో 3.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది.

ఒంగోలులో జోరు వర్షంలో రిక్షాపై వరిగడ్డి తీసుకెళుతున్న దృశ్యం

ఎన్నికల వ్యూహాలు

ముందస్తు ఎన్నికలు ఉండొచ్చన్న ఊహాగానాల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఎన్నికల వ్యూహాలు మొదలయ్యాయి. అటు అధికార పార్టీ వైసిపి, ఇటు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ తమ శ్రేణులను ఎన్నికలకు సిదద్ధం చేస్తున్నారు. వైసిపి అధినేత, సిఎం జగన్ పార్టీపరంగా రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో పాటు అన్ని నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించారు. తాడేపల్లిలో సమావేశం జరిపి దిశానిర్ధేశం చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు 'ఇదేం ఖర్మ మన రాష్టానికి..' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి నియోజకవర్గ పర్యటనలు చేపట్టారు. బాపట్ల, చీరాల నియోజకవర్గాల్లో రోడ్ షో, బహిరంగసభల్లో పాల్గొనాలనుకున్నారు. కానీ తుపాను ప్రభావంతో వర్షాల కారణంగా చీరాల పర్యటన వాయిదా పడింది. బాపట్ల నియోజక వర్గంలో చంద్రబాబు పర్యటన, ప్రసంగం దేశం శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. రాష్ట్రంలో సంక్షేమం లేదని.. సంక్షోభమే ఉందని చంద్రబాబు విమర్శించారు.

బాపట్ల జిల్లా ఏర్పడిన అనంతరం ఆరు నెలల తరువాత జిల్లా అభివృద్ధి మండలి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లాలో ఉన్న ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొనకపోవడంతో సమీక్ష మొక్కుబడిగా జరిగింది. జిల్లాలోని సమస్యలను ప్రస్తావించేవారు లేకపోవడంతో మంత్రులు జిల్లా అభివృద్ధిపై అధికారులకు దిశానిర్ధేశం చేశారు. జిల్లాను అన్ని రంగాలను అభివద్ధి చేసే దిశగా అధికారులు పనిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. జిల్లాలో గడపగడపకూ.. కార్యక్రమంలో మంజూరు చేసిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి ఇబ్బంది లేకుండా సాగర్ కాలువలు, కష్ణా పశ్చిమ డెల్టా కాలువల ద్వారా రైతాంగానికి సాగునీటిని అందిస్తామన్నారు. జిల్లాలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం రైతులను అదుకుంటుందన్నారు. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉంది. పౌర సరఫరాల శాఖకు చెందిన అద్దంకి గోదాం నుంచి రేషన్ షాపునకు చేరాల్సిన బియ్యంను రెవెన్యూ అధికారులు, సిబ్బందే అక్రమమార్గం పట్టించారు. జరిగిన అవినీతిపై స్పందించిన జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీనివాసులు చర్యలు తీసుకున్నారు. అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో రుజువు కావడంతో క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. అద్దంకి పౌర సరఫరాల శాఖ గోదాములో అక్రమాలకు పాల్పడిన గోదాము ఇన్‌ఛార్జి, ఉప తహశీల్దార్ షేక్ అహమ్మద్ షఫీని విధుల నుండి సస్పెండ్ చేశారు. గోదాము డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీదేవిని విధుల నుంచి పూర్తిగా తొలగించారు. హమాలీలను తొలగించారు. అధికార పార్టీ నేతల అండతో ఈ అక్రమ రవాణా జరిగిందనేది అందరికీ తెలిసిందే..

ప్రతి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల ద్వారా తాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిధులను మంజూరు చేసినప్పటికీ పనుల్లో పురోగతి లేదని కలెక్టర్ విజయకృష్ణన్ వ్యాఖ్యానించారు. జలజీవన్ మిషన్ కింద గత ఏడాది రూ 205.22 కోట్లతో 723 పనులు మంజూరు చేశారు. ఇటీవల మరో రూ.382.34 కోట్లతో 697 పనులు జిల్లాకు మంజూరయ్యాయి. అయితే సదరు పనులు చేస్తే బిల్లులు వస్తాయన్న నమ్మకం లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ప్రతి ఇంటికీ ఎంతో ప్రయోజనం కలిగే పనుల ప్రాధాన్యతను అధికారులు గుర్తించడం లేదని, అభివద్ధి పనులను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా అధికారులు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ప్రతి సమావేశంలో హెచ్చరిస్తున్నారు. కానీ నిధుల మంజూరు సమస్య కారణంగా ఇంటింటికీ కుళాయిలతో పాటు పలు అభివృద్ధి పనులు జిల్లాలో ముందుకు సాగడం లేదు.

డిసెంబరు నెల రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రస్తుతం వచ్చిన మాండోస్ తుపాను 2020లో వచ్చిన నివర్, అలాగే 2018లో వచ్చిన గజ తుఫాను కంటే బలమైనదని చెబుతున్నారు. ఈ తుఫాను ప్రభావం కారణంగా బాపట్ల జిల్లాలో కోతకు వచ్చిన వరి పైరుకు అపార నష్టం వాటిల్లనుంది. దాదాపు 80 వేల ఎకరాల్లో వరి పంట పరిస్థితి ప్రశ్నార్ధకమయింది.వరి పైరు అధిక భాగం కోత దశలో ఉంది. వేల ఎకరాల్లో కోసి కొంత కుప్పలు వేయగా మరికొంత పైరు పొలంలో పరచి ఉంది. రెండు రోజుల పాటు గాలులతో కూడిన వర్షాలు పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. శుక్రవారం మొదలయిన వర్షాలు పడుతూనే ఉన్నాయి.

- బాపట్ల జిల్లా